1

నవతెలంగాణ

ఆదిలాబాద్

శనివారం | డిసెంబర్ 21, 2024 | www.navatelangana.com

ముందస్తు గణిత దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ముందస్తు గణిత దినోత్సవ వేడుకలను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణపతి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గావుడే హనుమంతు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వారానికి ఒకసారి ఇలాంటి స్టాళ్లను తయారు చేసి ప్రదర్శించడం వల్ల గణితంలో మరింత ప్రతిభ మెరుగుపడుతుందని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు తయారుచేసిన స్టాళ్లను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాయికిని శ్రీనివాస్, మహేశ్వర్ ఉన్నారు.



ప్రయాణికులకు సౌకర్యాలే లక్ష్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రయాణికుల సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని డిపో మేనేజర్ విశ్వనాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ప్రయాణికుల మర్యాద దినోత్సవంలో భాగంగా డిపో మేనేజర్ బస్సులలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు గులాబీ పువ్వులన్నిందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు ఆర్టీసీకి అండ అన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రయాణికుల ఆదరణతోనే ఆర్టీసీ ముందడుగు వేస్తుందన్నారు.



చనాకా-కోర్టపై కదలిక..!

- ఈ ప్రాజెక్టు పనులపై దృష్టిసారించిన సర్కారు
- భూసేకరణ కోసం రూ.76కోట్లు మంజూరు
- ఆయకట్టు దారుల్లో చిగురిస్తున్న ఆశలు
- ఫైనాన్స్ క్లియరెన్స్ కోసం అధికారుల ఎదురుచూపు
- పనులు చేపడితే ఈ ఏడాది 25వేల ఎకరాలకు సాగునీరు

కొన్నేండ్లుగా స్థబ్దుగా ఉండిపోయిన చనాకా-కోర్ట బ్యారేజీ పనులకు మళ్లీ కదలిక వస్తోంది. మిగిలిన పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం స్పష్టం చేయడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అసెంబ్లీలో ఈ ప్రాజెక్టులో చేపట్టాల్సిన మిగిలిన పనుల విషయమై ప్రస్తావించిన సందర్భంలో రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధానమిచ్చారు. ఈ ప్రాజెక్టును తమ ప్రభుత్వం ప్రాధాన్యక్రమంలో తీసుకుందని.. నిధులు కేటాయించామని.. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పడంతో జిల్లావాసుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కొన్నేండ్లుగా పనులు నిలిచిపోయి వృధాగా ఉన్న ఈ ప్రాజెక్టు పనుల ప్రారంభంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం తొలి విడతలో ఈ ప్రాజెక్టు భూసేకరణ కోసం రూ.76కోట్లు మంజూరుచేసింది. కానీ ఫైనాన్స్ క్లియరెన్సు రాకపోవడంతో పనులు ప్రారంభించలేని పరిస్థితి నెలకొంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దున నిర్మించిన చనాకా-కోర్ట బ్యారేజీ పనులపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇన్నాండ్లు నిధులు లేక కాల్వల నిర్మాణం పూర్తికాక ఆయకట్టుకు సాగునీరందించలేని ఈ ప్రాజెక్టుకు మళ్లీ మహర్దశ పట్టనుంది. ప్రభుత్వం తక్కువ బడ్జెట్‌తో పూర్తయ్యే ప్రాజెక్టులను కొన్నింటినీ ఈ ఏడాది ప్రాధాన్యక్రమంలో తీసుకొని నిధులు కేటాయించింది. ఇందులో సదర్‌మాట్, పిప్రి ప్రాజెక్టులతో పాటు చనాకా- కోర్ట కూడా ఉండటం గమనార్హం. దీంతో ఈ ప్రాజెక్టు ఆయకట్టుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1227 కోట్లతో అంకురార్పణ చేసింది. 2015-16 పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా బ్యారేజీ నిర్మాణంతో పాటు పంప్‌హౌస్ పనులు కూడా ఇప్పటికే పూర్తిచేశారు. ఈ బ్యారేజీ ద్వారా ఆదిలాబాద్ నియోజకవర్గంలోని బేల, జైనథ్ మండలాలతో పాటు బోథ్ నియోజకవర్గంలోని భీంపూర్ మండలంలోని 51వేల ఎకరాలకు సాగునీరందించనుంది. ఇప్పటికే అధికారులు పలుమార్లు ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. మరోపక్క 45కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వ పనులు కూడా పూర్తిచేశారు. కానీ డిస్ట్రిబ్యూటరీ (పిల్లకాల్వలు) లేకపోవడంతో ఆయకట్టుకు సాగునీరందించలేని పరిస్థితి ఉంది. అప్పటి ప్రభుత్వం గత ఆరేండ్ల నుంచి మిగిలిన పనులకు నిధులు కేటాయించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. భూసేకరణ ప్రక్రియ చేపట్టినా.. నిధులు రాకపోవడంతో రైతులకు పరిహారం ఇవ్వలేదు. దీంతో ఈ ప్రక్రియ అక్కడే నిలిచిపోయింది.

రూ.76కోట్లు మంజూరు..!

చనాకా-కోర్ట బ్యారేజీ నుంచి సాగునీటిని అందించేందుకు భూసేకరణ చేపట్టడం అత్యవసరంగా మారింది. ఈ డిస్ట్రిబ్యూటరీ కాల్వల కోసం మొత్తం 1800 ఎకరాలు అవసరం కాగా.. ఇందుకు సుమారు రూ.200కోట్ల నిధులు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు. అధికారులు ఇప్పటికే అవసరమైన భూసేకరణ చేపట్టి సిద్ధంగా ఉంచినప్పటికీ నిధుల లేమి కారణంగా రైతులకు పరిహారం ఇవ్వలేని పరిస్థితి ఉంది. దీంతో పనులు ప్రారంభం కాలేక ఆయకట్టుకు సాగునీరందించలేని పరిస్థితి ఉంది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం తొలి విడతలో ప్రాధాన్య క్రమంలో భూసేకరణ కోసం రూ.76కోట్లు కేటాయించింది. ఈ నిధులు ప్రస్తుతం జిల్లా కలెక్టర్ పీడీఎఫ్ ఖాతాలో ఉన్నట్లు తెలిసింది. కానీ ఆర్థికశాఖ నుంచి ఫైనాన్స్ క్లియరెన్సు రాకపోవడంతో నిధులు విడుదల కావడం లేదు. ఆర్థికశాఖ నుంచి ఆమోదం లభించగానే.. తొలి విడతలో విడుదలయ్యే ఈ నిధులతో సుమారు 700 ఎకరాలకు సంబంధించి భూమి సేకరణ కోసం నిధులు వెచ్చించేందుకు అవకాశం ఉంటుంది. ఈ నిధులతో పనులు పూర్తిచేస్తే తొలి విడతలో కనీసం 25వేల ఎకరాలకైనా సాగునీరందించేందుకు ఆస్కారం ఉంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. రానున్న మార్చి, ఏప్రిల్ వరకు ఈ ప్రక్రియ పూర్తయితే ఇదే ఏడాదిలో రైతులకు సాగునీరందించేందుకు అవకాశం లభించనుంది.





పూర్తయిన ప్రధాన కాలువ పనులు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-దహెగాం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్ధల దేవయ్య అన్నారు శుక్రవారం మండలంలోని పిపిరావు కాలనీ, కల్వాడ గ్రామాలలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మంచి పాలన కోసం భవనాలు అవసరమని, అందుకే ప్రభుత్వం నూతన భవనాలను మంజూరు చేసిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోగయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గందె వెంకటేష్, నాయకులు సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

అలరించిన వెల్ బేబీ షో



నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ డిస్పెన్సరీలో డీవైసీఎంఓ డా.పి.రమేష్‌బాబు ఆధ్వర్యంలో వెల్ బేబీ షో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం సూర్యనారాయణ, సేవ అధ్యక్షురాలు మాలతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలందరూ మంచి అలవాట్లను చిన్నప్పటినుండే అలవాటు చేసుకోవాలని, సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సింగరేణి ఆవిర్భావ దినోత్సవమైన డిసెంబర్ 23న ప్రగతి స్టేడియంలో బహుమతులు అందచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సీనియర్ పీఓ పి.కాంతారావు, డాక్టర్లు మురళీధర్, లోకనాథ్ రెడ్డి, మనీషా పాల్గొన్నారు.


పేద యువతి పెండ్లికి రూ.5వేల ఆర్థిక సాయం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పేద కుటుంబానికి చెందిన పద్మ-భూమేష్ కూతురు నేహశ్రీ(రక్షిత) వివాహానికి ఇదే గ్రామానికి చెందిన యువకులు పెరుగు మల్లికార్జున్, కూకటికారి శంకర్ సహకారంతో రూ.5వేలను మాజీ ఎంపీటీసీ దర్శనాల వెంకట స్వామి చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ పేద కుటుంబానికి యువకులు చేసిన సహాయాన్ని అభినందించారు. కార్యక్రమంలో యువకులు నాడెం శ్రీనివాస్, కామెర శివాజీ, కూకటికారు గంగాధర్, వేముల నాగేష్, పెరుగు లింగన్న పాల్గొన్నారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఓ దినపత్రిక విలేఖరి మైలారం శ్రీనివాస్ యువతి పెళ్లి ఖర్చులకు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు.

క్షతగాత్రునికి యూత్ సభ్యుల అండ



నవతెలంగాణ-చింతలమానేపల్లి

రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని డబ్బా ధరంపల్లి గ్రామానికి చెందిన యువకుడు గుర్లే నితిన్‌కు మహాత్మ జ్యోతిరావు పూలే సేవా సమితి యూత్ సభ్యులు అండగా నిలిచారు. దాతల సాయంతో రూ.42,060 శుక్రవారం యువకుని తండ్రి గుర్ల నారాయణకు అందజేశారు. యువకుడు కొన్ని రోజుల క్రితం అదుపుతప్పి బైక్ పైనుండి పడి గాయపడ్డాడు. కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబం కావడంతో యువకులు ఆర్థిక సాయం అందజేశారు. సాయం చేసిన ప్రతిఒక్కరికీ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూలే సేవా సమితి సభ్యులు గుర్లే శ్రీనివాస్, కావుడే సాయికిరణ్, కొట్రంగి తిరుపతి, కావుడే సంతోష్, తిరుపతి పాల్గొన్నారు.

అమిత్ షా అనుచిత వ్యాఖ్యలకు నిరసన

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

అమిత్ షా ఇటీవల అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సీపీఐ(ఎం), ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ ఫోరమ్ జిల్లా కమిటీ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఫసిఉద్దీన్ మాట్లాడుతూ అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. ఈ వ్యాఖ్యలు అంబేద్కర్ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉన్నాయన్నారు. అమిత్ షా వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు రాజేశ్వర్, అతిక్, గంగారాం, మున్నా, భీమ్‌రావు, పంద్రం ఆనంద్‌రావు పాల్గొన్నారు.



జన్నారం : పార్లమెంట్‌లో కేంద్రమంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు సోహెల్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బే షరతుగా దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రియాజ్ ఉద్దీన్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఫసివుల్లా, మండల నాయకులు ముత్యం రాజన్న, సాధుపాషా, టౌన్ అధ్యక్షులు రమేష్ పాల్గొన్నారు.

అమిత్ షాను మంత్రి పదవి నుండి తొలగించాలి

అమిత్ షాను మంత్రి పదవి నుండి తొలగించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండుకూరి రాజు, జిల్లా అధ్యక్షులు లింగంపల్లి రాజలింగం డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ వారు శుక్రవారం చింతగూడలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

ఆదిలాబాద్‌టౌన్ : భీం ఆర్మీ ఆజాద్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన చేపట్టారు. నేతాజీ చౌక్‌లో అమిత్ షాకు వ్యతిరేకంగా నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన నినాదాలు చేశారు. అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన మంత్రి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ షకీల్ పాల్గొన్నారు.



జన్నారంలో ఎన్ఎస్‌యూఐ నిరసన



ఆదిలాబాద్‌లో భీం ఆర్మీ ఆజాద్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో..

పత్తి పరిశీలన కేంద్రాలు మూసివేత



నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలో దుబ్బగూడ, వెంకట్రావుపేట వద్ద ఏర్పాటు చేసిన రెండు పత్తి పరిశీలన కేంద్రాలు కొన్ని రోజులుగా మూతబడ్డాయి. రాజకీయ నాయకుల అధిక జోక్యంతో మూసి వేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మార్గం గుండా తెలంగాణ రాష్ట్రం నుండి మహారాష్ట్రకు రైతులు, పత్తి వ్యాపారం చేసే యజమానులు పత్తిని అమ్ముకోవడానికి తీసుకెళ్తారు. పరిశీలప కేంద్రాలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరకు క్వింటాల్‌కు ఒక శాతం పన్ను వసూలు చేస్తారు. ఈ పరిశీలన కేంద్రాల ద్వారా రోజుకు సుమారు లక్ష రూపాయల వరకు పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. మూసి ఉండడంతో ఆదాయానికి గండిపడుతోంది. ఈ విషయంపై మార్కెట్ కమిటీ కార్యదర్శిని వివరణ కోరగా చెక్ పోస్టుల్లో సిబ్బంది కొరతతో అక్కడ వ్యక్తులను ఉంచడం లేదని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్ణయం ప్రకారం త్వరలోనే సిబ్బందిని నియమిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులకు షీ టీం అవగాహనా సదస్సు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆసిఫాబాద్ సబ్ డివిజన్ షీ టీం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అవగాహన కార్యక్రమానికి డిసిఆర్బి ఇన్‌స్పెక్టర్ కేశవులు హాజరై మాట్లాడుతూ మహిళలు, పిల్లల రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు మరింత దగ్గరై సేవలు అందిస్తున్నామని, ఏదైనా సమస్య ఉంటే డయల్ 100కు కాల్ చేయాలని తెలిపారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులు చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలికలను ఎవరైన వేధిస్తే ఆసిఫాబాద్ షి టీమ్ నంబర్ 8712670564కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ, సిబ్బంది లింగమూర్తి, షిటీమ్ సిబ్బంది సునీత, శ్రీలత, స్వప్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ లక్ష్యాలు పూర్తి చేయాలి : కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ కింద నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులో క్లస్టర్ల వారిగా పని దినాలు, చేపడుతున్న పనులు తదితర అంశాలపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఈఓ జితేందర్, డిఆర్డీఓ సాయన్న, ఎంపిడిఓలు, ఎంపిఓ, ఏపీడిలతో సమీక్షించారు. వనమహోత్సవం, మహిళా శక్తి ఉపాధి భరోసా, స్వచ్ఛభారత్ మిషన్, సోషల్ ఆడిట్‌లపై అన్ని మండలాల ఎంపిడిఓలు ఆయా మండలాల్లో సాధించిన లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల పరిధిలో కిచెన్ గార్డెన్ 95 ప్రభుత్వ పాఠశాలలో 13, 527 కూరగాయల మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడి పాఠశాలలో కిచెన్ గార్డెన్, న్యూట్రి గార్డెన్ కొరకు స్థల సేకరణ జరపాలని తెలిపారు. అలాగే నర్సరీలలో ఈత, ఖర్జూర మొత్తం 468 జీపీలలో 9లక్షలు టార్గెట్ కాగా 5,04,500 మొక్కలు నాటడం జరిగిందని, ఇంకా బ్యాలెన్స్ 3,95,500, క్యాటిల్ షెడ్ వర్క్స్ 340 పనులకు 232 పనులకు మంజూరు కాగా 59 వర్క్ గ్రౌండ్ చేయడం జరిగిందని అన్నారు. పొలంబాటలు(రోడ్స్ టూ అగ్రికల్చర్ ఫీల్డ్స్) వర్క్స్ టార్గెట్ 59.5 కాగా మంజూరైనవి 200 ఇందులో 6 గ్రౌండింగ్, చెక్ డ్యామ్స్ పనులు టార్గెట్ 51 కాగా 85 మంజూరు 5 గ్రౌండిగ్, తదితర అంశాలపై సమీక్షించి లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | డిసెంబర్ 21, 2024 | www.navatelangana.com

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలి

నవతెలంగాణ-లోకేశ్వరం



ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ వెంకట రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు కిష్టాపూర్ గ్రామంలో సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సర్వేలో పాల్గొంటున్న అధికారులకు పలు సూచనలు చేశారు. లబ్ధిదారుల వివరాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. పేదల సొంత ఇంటి కలను నిజం చేసేందుకు గానూ చేపట్టిన ఈ సర్వేను సజావుగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్టీల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

సీఆర్టీల సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు పవన్, అజయ్ అన్నారు. శుక్రవారం గిరిజన ఆశ్రమ పాఠశాల సీఆర్టీ ఉపాధ్యాయుల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో పాటు కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ కూడా రాత్రి పగలు కష్టపడి తమ విధులను నిర్వర్తిస్తూ, గిరిజన విద్యార్థులకు విద్యను అందిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యలను దృష్టిలో పెట్టుకొని, సమాన పనికి సమాన వేతనం ఇచ్చి వారి ఎంటీఎస్‌ను అమలు చేసి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు కొమ్ము కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ స్వామి, మండలాధ్యక్షులు, కార్యదర్శులు విజయ్ కుమార్, జితేందర్, శ్రీనివాస్, సంజీవ్, దత్త రామ్, ప్రేమ పాల్గొన్నారు.



అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలి

- ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి
- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన పూసం సచిన్
- బస్టాండ్ ఎదుట అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డా.బీఆర్ అంబేద్కర్‌పై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట టీఏజీఎస్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పూసం సచిన్ మాట్లాడుతూ హోమ్ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని, ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది అంబేద్కర్‌పై మాత్రమే కాదని, సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని కొనసాగిస్తున్న లక్షలాది మంది అణగారిన వర్గాల వారికి జరిగిన అవమానమని అన్నారు. భారత రాజ్యాంగంపై బీజేపీ చేస్తున్న దాడికి వ్యతిరేకంగా ప్రజల నుంచి పెరుగుతున్న ప్రతిఘటన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. భారత ప్రజలపై మనువాద భావజాలాన్ని రుద్దేందుకు ఈ శక్తులు అవిశ్రాంతంగా పని చేస్తున్నాయన్నారు. అమిత్‌షా, బీజేపీ నాయకుల ఆలోచనలు కులతత్వంతో కూడుకున్నవని, రాజ్యాంగం పట్ల వారికి గౌరవం లేదని మరోసారి రుజువైందని అన్నారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ తరచుగా వ్యక్తం చేసే అసహనం దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం కోసం అంబేద్కర్ పోరాడి నడిపిన ఉద్యమాలు, ఆదర్శాల పట్ల వారి లోతైన ద్వేషాన్ని వెల్లడిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లంక రాఘవులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్తాత్రి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, టీఏజీఎస్ నాయకులు ఆత్రం కిష్టన్న, వెట్టి గణేష్, రాము, కె.ఆశన్న ప్రశాంత్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : భారత రాజ్యాంగ నిర్మాతను అవమానిస్తే సహించేది లేదని దళిత సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని దళిత సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశానికి దిశ నిర్దేశం చేసి, బడుగు బలహీన వర్గాలకు, విద్యా ఉద్యోగ, రాజకీయ, స్వేచ్ఛ సమానత్వ హక్కులు కల్పించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరును అవహేళన చేస్తు, కించపరిచే విధంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అంబేద్కర్ సంఘ నాయకులు నాగయ్య, మురళీధర్, ముత్యం, సుచిత్ కళ్యాణ్, లక్ష్మణ్, వినోద్, సాయి, శివ, నిమ్మల రఘు, త్రినేష్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : కేంద్ర మంత్రి అమిత్‌షా బీఆర్ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు దేశ ప్రజలకు బేషరత్తుగా క్షమాపణలు చెప్పాలని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కుమురంభీం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌నీ అవమానించిన అమిత్‌షా తన మంత్రి పదవికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని అన్నారు. లేనిపక్షంలో ఆదివాసీ దళిత బహుజన అన్ని వర్గాల ప్రజలు విద్యార్థి, యువజన, ఉద్యోగ, ఉపాధ్యాయ, మహిళ, కార్మిక, కర్షక సంఘాలతో కలిసి ఉద్యమాన్ని చేపడతామని అన్నారు. దేశంలో అత్యుత్తమ స్థానంలో ఉండి, దేశ హోమ్‌శాఖ మంత్రిగా ఉన్న అమిత్‌షా అంబేద్కర్ పేరు కంటే దేవుడి పేరును జపిస్తే ఏడు జన్మల స్వర్గం ప్రాప్తిస్తుందంటూ అంబేద్కర్ పేరును అవమానపరిచేలా మాట్లాడిన అమిత్‌షా దేశ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, నాయకులు తొడసం ప్రకాష్, వెడ్మ మాన్కుబాయి, చాకటి అనుసయబాయి, చంద్రకాంత్, అమూల్, రాములు, శివరాం, చరణ్, మచ్చెందర్, పుల్‌చంద్, కేశవ్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ధర్మసమాజ్ పార్టీ మండలాధ్యక్షులు సర్కిల్ నరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలకు ఓ రాజ్యాంగం ఉందని, దీనిలో సమానత్వ ప్రతిపాదనలు అనేకం ఉన్నాయని వెల్లడించారు. దేశ ప్రజలకు రాజ్యాంగం ద్వారా ప్రాథమిక హక్కులను కల్పించిన చరిత్ర అంబేద్కర్‌దేనని తెలిపారు. అటువంటి అంబేద్కర్‌ను అవమానించడం అమిత్‌షా దురహంకారానికి నిదర్శనంగా పేర్కొన్నారు. దేశంలో కోటను కోట్ల ప్రజల విముక్తి కల్పించిన అంబేద్కర్ అవమానించిన వారిని వెంటనే పదవి నుంచి తొలగించాలని లేని పక్షంలో ఆందోళనను తీవ్రంగా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కార్తీక్, రాములు, నర్సయ్య, రాజేశ్వర్ పాల్గొన్నారు.

నార్నూర్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోమ్‌శాఖ మంత్రి అమిత్‌షా వెంటనే పదవికి రాజీనామా చేయాలని శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంలో మండల దళిత నాయకులు మోటేరావ్ అనిల్ తదితరులు డిమాండ్ చేశారు.

వారి వెంట దళిత నాయకులు జాబాడే మనోహర్, జాంబ్లె బాబు, బాన్సుడే ఉత్తం, కాంబ్లె భగవాన్, సిద్దేశ్వర్, గోవింద్, విలాస్, రాహుల్, విజయానంద్, ధన్ రాజ్, రవి, శివాజీ, చంద్ర ప్రకాశ్, సంజీవ్ ఉన్నారు.


ఆదిలాబాద్‌రూరల్



సారంగాపూర్

రేపు అమిత్‌షా వాఖ్యలకు నిరసనగా ర్యాలీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించేలా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా 22న ఆదివారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని అంబేద్కర్ ఆత్మ గౌరవ ఉమ్మడి ఉద్యమకార్యాచరణ కమిటీ నాయకులు అగ్గిమల్ల గణేష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పార్టీలు కులాలు, మతాలకు అతీతంగా తీర్మానించడం జరిగిందన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. వెంటనే దేశ ప్రజలకు అంబేద్కర్‌కు క్షమాపణ చెప్పాలని, తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో అంబేద్కర్ ఆత్మగౌరవ ఉమ్మడి ఉద్యమ కార్యాచరణ కమిటీ నాయకులు రత్నపురం రమేష్, దాండిగే సందీప్, నిమ్మల ప్రశాంత్, భూమన్న, నవీన్ కుమార్, దయాకర్, నజీర్, జహీర్ రంజాని, రత్నజాడే ప్రజ్ఞకుమార్, గణేష్ మెకానే, మనోజ్, ప్రసన్న, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రయాణికుల మర్యాద దినోత్సవం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఆర్టీసీ నిర్మల్ బస్టాండ్‌లో శుక్రవారం ప్రయాణికుల మర్యాద దినోత్సవాన్ని నిర్వహించారు. నిర్మల్ బస్టాండ్ స్టేషన్ మేనేజర్ ఏఆర్ రెడ్డి, కంట్రోలర్‌లు దెగాం భాస్కర్, జీఆర్.రెడ్డి, భోజగౌడ్, టివి రమణ, బస్ పాస్ గంగన్న బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులకు పువ్వులను అందచేస్తూ, ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నందులకు ప్రయాణికులకు మర్యాద దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం, సుఖవంతం, శుభప్రదం అని, ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు. ఆర్టీసీ ప్రవేశ పెట్టిన గమ్యం యాప్‌ను పెండ్లిలకు విహారయాత్రలకు అద్దె ప్రాతిపదికన బస్సులను వినియోగించుకోవాలని డిపోమేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు.

టీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకుల సంఘీభావం



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న సీఆర్టీ ఉపాధ్యాయలకు టీఎస్‌టీటీఎఫ్ సంఘం నాయకులు శుక్రవారం మద్దతు తెలిపి, విరాళం అందించారు. ఐటీడీఏ ముందర కొనసాగుతున్న సీఆర్టీల సమ్మె శిబిరానికి టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రకాంత్ నాయక్, రాష్ట్ర నాయకులు కపిల్ కుమార్, జిల్లా అధ్యక్షులు దినేష్ నాయకులతో కలసి సమ్మెలో కూర్చొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఆర్టీ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అన్నారు. ప్రతి నెల1న వేతనం వేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను రాష్ట్ర శాఖలో తీర్మానం చేసి ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి సమస్య పరిస్కారం చేసే విధంగా కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమం టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు బానోత్ రవీందర్, సీతారామ్, గోవింద్, విలాస్, రాంకుమార్, శ్రీనివాస్, రవీందర్, లక్ష్మణ్, అంబర్ సింగ్ పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి రుణాలు ఇచ్చి ప్రభుత్వం చేయూత నిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన దక్కన్ గ్రామీణ బ్యాంకు శాఖను కలెక్టర్ రాజర్షిషా, బ్యాంకు చైర్మెన్ శోభతో కలిసి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్వయం సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజి రుణాలను అందించి చేయూత నిస్తోందన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. మహిళా సంఘాలకు మంజూరైన రూ.25కోట్ల చెక్కును అందజేశారు. అనంతరం స్థానిక గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను యాప్‌లో అప్ లోడ్ అయిన వివరాలను పరిశీలించారు. వీధి దీపాలకు సోలార్ ఎనర్జీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, ఎంపీడీఓ కే.భాస్కర్, తహసీల్దార్ ఎం.ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-తలమడుగు

మనపల్లె స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని రుయ్యాడిలోని స్వామి వివేకానంద గ్రంథాలయానికి రూ.15వేల విలువ చేసే పుస్తకాలతో పాటు పోటీ పరీక్షల పుస్తకాలను ఆ సంస్థ అధ్యక్షులు బద్దం నర్సింగ్‌రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం గ్రంథాలయ సభ్యులు దాత బద్దం నర్సింగ్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు భావితరాలకు ఉపయోగపడే ఉద్యోగులను తయారుచేసే ప్రయోగశాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ ప్రసూన్‌రెడ్డి, కారోబారి సంజీవ్‌రెడ్డి, గొనేల గంగన్న, గ్రంథాలయ సభ్యులు చైతన్య, మహేష్, నరేష్, కళ్యాణ్, వికాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి



నవతెలంగాణ-నార్నూర్

గ్రామాభివృద్ధికి అందరం కలిసి కృషి చేద్దామని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పెసా ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ఐక్యతతో ఉంటే గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయవచ్చని అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జవహర్‌లాల్, జేఏసీ మాజీ చైర్మెన్ రాథోడ్ ఉత్తం, పీఏసీఎస్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, పెసా చైర్మెన్ రాథోడ్ సికిందర్, మడావి మాన్కు, డైరెక్టర్ దుర్గే కాంతారావ్, దళితరత్న అవార్డు గ్రహీత నర్సింగ్ మోరే, యశ్వంత్‌రావ్ చౌహన్, వీటీడీఏ చైర్మెన్ డిగాంబర్ ఆడే, మాజీ ఉపసర్పంచ్ మహేందర్, బాలాజీ, బిక్కు, మహేందర్, రాథోడ్ సుభాష్, బిక్షపతి ఉన్నారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన లభించినట్టు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెంబి మండల కేంద్రానికి అదనపు బస్సు, ఖానాపూర్ నుంచి హైదరాబాద్‌కు బస్సు, భైంసాకు సెమి డీలక్స్ బస్సు నడపాలని ప్రయాణికులు ఫోన్ ద్వారా కోరారని త్వరలోనే ఆయా రూట్లకు బస్సులు నడుపుతామని తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట ఏఎన్ఎంల ఆందోళన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత ఇరవై సంవత్సరాలుగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు ఎటువంటి రాత పరీక్షలు లేకుండా రెగ్యులర్ చేయాలనీ డిమాండ్ చేస్తూ, 48 గంటల పాటు ధర్నా చేపట్టారు. తెలంగాణ వైద్యారోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నాను ప్రారంభించారు. ఇందులో భాగంగా రెండవ రోజు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఏఎంఎంల రాత పరీక్ష హాల్ టికెట్‌లను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. గతంలో చేసిన సమ్మె సమయంలో ఏఎన్ లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయడంతో పాటు రాత పరీక్షను రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. అనంతరం అక్కడే రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. వాహనాల రాకపోకలను అడ్డుకోగా ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోలనకారులను సముదాయించే ప్రయత్నం చేయగా, వారి సమస్యలను పోలీసులతో ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా పలువురు ఏఎన్ఏంలు మాట్లాడుతూ కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలనీ డిమాండ్ చేస్తున్నప్పటికీ రాత పరీక్షా హాల్ టికెట్‌లను విడుదల చేయడం దారుణమని అన్నారు. తమ ఇరవై సంవత్సరాల సర్వీసును గుర్తించి ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని కోరారు. తాము 48 గంటల ధర్నా చేస్తున్న సమయంలోనే హాల్ టికెట్లను విడుదల చేశారన్నారు. ప్రతినిత్యం పనిలో గడిపే తమతో పరీక్షలు రాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే రాత పరీక్షను రద్దు చేసి ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కమిటీ కన్వీనర్ నవీన్ కుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, స్వామి, ఏఎన్ఎంలు పుష్ప, ఆనంద బాయి, పద్మ, తులసి, లలిత, మణిలత, ప్రియదర్శిని, అనురాధ పాల్గొన్నారు.

రోడ్డుపై భోజనాలు చేస్తూ సమగ్ర ఉద్యోగుల నిరసన

- 11వ రోజుకు చేరిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరసన కొనసాగుతోంది. శుక్రవారం సమ్మె 11వ రోజు చేరుకోగా, సమ్మెలో భాగంగా వంటావార్పుతో వినూత్న నిరసన తెలిపారు. సమ్మె శిబిరం వద్ద వంటలు చేశారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా ఎన్టీఆర్ చౌక్ వరకు వచ్చి నిరసన తెలిపారు. అనంతరం అక్కడి రహదారిపై కూర్చొని, ఉద్యోగులు అందరూ భోజనాలు చేస్తూ నిరసన తెలిపారు. వంటవార్పు సీఎం ఆలోచనల్లో మార్పు, సమగ్ర శిక్షా రెగ్యులర్ కోసం తీర్పు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి తమకు ఇచ్చిన మాట మేరకు రెగ్యులర్ చేయాలని, ప్రజా ప్రభుత్వమని నిరూపణ చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ప్రియాంక మాట్లాడుతూ ముఖ్య మంత్రి మాట తప్పితే ఉద్యమం తీవ్రంగా ఉంటదని, కేజీబీవీలు పూర్తిగా బంద్ చేస్తామని హెచ్చరించారు. కాగా వీరు చేపట్టిన వంటావార్పుకు మావల ఏంఈఓ సరోజ అన్నదాన ఏర్పాటు చేశారు.



పలువురి మద్దతు...

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అమర్ సింగ్ తిలావత్, శశికళ, నాయకులు ఉదయ్ రావు, దేవదాస్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మాజీ సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమల్‌గౌడ్, ఏబీఎం రాష్ట్ర అధ్యక్షులు కినాకే సురేష్ సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జె.ధరంసింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, పార్థసారథి, వెంకటి, దేవదర్శన్, దీప్తి, సురేష్, స్వప్న, సురేందర్ ఉన్నారు.

క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 21న శనివారం సాయంత్రం 6గంటలకు జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ గార్డెన్‌లో నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని క్రిస్మస్ నిర్వహణ కమిటీ ఉపాధ్యక్షులు కె.ప్రసన్న కుమార్, జనరల్ సెక్రటరీ బి.జయంత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఈ కార్యక్రమానికి క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షిషాను, ఎస్పీ గౌస్ ఆలంను, ఎమ్మెల్యే పాయల శంకర్, ఎంపీ గోడం నగేష్‌ను ఆహ్వానించినట్టు తెలిపారు.

చెస్ క్రీడాకారులను అభినందించిన జీఎం

నవతెలంగాణ-రెబ్బెన



సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన చిన్నారులను శుక్రవారం బెల్లంపెల్లి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అభినందించారు. గోలేటి గ్రామానికి చెందిన చిన్నారులను అవినాష్ (ఎస్ హీరా లాల్ ఖైరుగుడా ఓపెన్ కాస్ట్‌లో ఎలక్ట్రాకల్ సూపర్ వైజార్) భువను ఋషి (సత్యనారాయణ ఖైరిగూడ ఓపెన్ కాస్ట్ ఈపీ ఆపరేటర్) పోటీలకు ఎంపికైన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కుమురంభీం చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్ సంపత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బోగే ఉపేందర్, ఖైరిగూడ పీఓ నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మండల అధ్యక్షుడి ఎన్నిక

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రంలో ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సెండె చందు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మడావి సోము, కార్యవర్గ సభ్యులుగా మాణిక్ రావు, పుండ లీక్, సోము, ఉల్లాస్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడిగా ఎన్నికైన చందు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ సమస్యల సాధనకు కృషి చేస్తానన్నారు. అనంతరం చందును కార్యవర్గ సభ్యులు అభినందించారు.

బీబ్రా గ్రామపంచాయతీలోనే కొనసాగించాలి

- దేవాజీగూడ గ్రామస్తుల డిమాండ్



నవతెలంగాణ-దహెగాం

దేవాజీగూడ గ్రామాన్ని బీబ్రా గ్రామపంచాయతీలోనే కొనసాగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కవితకు, ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఆవిర్భావ కాలం నుంచి బీబ్రా గ్రామపంచాయతీలోనే తమ గ్రామం కొనసాగుతుందని అన్నారు. నూతనంగా జెండా గుడా గ్రామపంచాయతీ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపుతూ దేవాజీగూడ గ్రామాన్ని జెండా గుడాలో విలీనం చేసేందుకు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. గ్రామస్తులంతా బీబ్రా గ్రామపంచాయతీలోనే ఉంటామని వేరే గ్రామ పంచాయతీలకు తాము వెల్లబోమని అన్నారు. వేరే గ్రామపంచాయతీలో విలీనం చేసే ఆలోచనను మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు సుజాయిత్‌ఖాన్



నవతెలంగాణ-కెరమెరి

సమస్యలు పరిష్కరించాలని గత వారం రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు సుజాయిత్ ఖాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి అయన మాట్లాడారు. గత 18 ఏండ్లుగా సమగ్ర శిక్ష లో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అన్నారు. 2023లో సమ్మె చేస్తున్న సమయంలో ప్రతి పక్ష నేతగా ఉన్న ముఖ్యం మంత్రి, రెగ్యులర్ చేయడం, పే స్కేల్ ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 488లో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో విద్యా శాఖ పరిధిలోని పలు రకాల సేవలు నిలిచిపోయినట్టు తెలిపారు. ఉద్యోగులందరిని విద్యా శాఖలో విలీనం చేయాలన్నారు. అప్పటి వరకు ఉద్యోగభద్రతతో కూడిన పే స్కెల్ ఇవ్వాలన్నారు. ప్రతి ఉద్యోగికి జీవిత భీమా 10 లక్షలు, ఆరోగ్య భీమా 10 లక్షలు సౌకర్యం కల్పించాలన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు పదవి విరమణ చేస్తున్న వారికీ 25 లక్షలు ఇవ్వాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ రీ ఎంగేజ్ విధానాన్ని తీసేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే సమగ్ర ఉద్యోగుల తో చర్చలు జరిపి సమ్మె విరమకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు సిడాం తిరుపతి, ప్రధాన కార్యదర్శి కుతుబొద్దీన్, జావీద్ పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని బాబాసాగర్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈఓ జయరాజ్ తనిఖీ చేశారు. పాఠశాలలోని వివిధ రికార్డులను రిజిస్టర్లను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం భోజనం మెనూ సరిగ్గా పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకొని, జిల్లా ఉన్నతాధికారులకు తెలిపామని అన్నారు.

రోడ్డు నియమాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బీసీ వసతి గృహంలో శుక్రవారం రోడ్డు భద్రత నియమాలపై ఎంవీఐ శంకర్ నాయక్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో వెళ్లేటప్పుడు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ప్రతి ఒకరు వీటిపై అవగాహన కలిగి ఉండాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వసతిగృహ వార్డెన్ మధుకర్, ఆర్టిఏ సిబ్బంది సంతోష్, వాజిద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్ర దుస్తులు, బతుకమ్మ ఆటలతో నిరసన

- మద్దతు తెలిపిన వామపక్ష నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమస్యలు పరిష్కరించి వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు ఈ నెల 10వ తేదీ నుండి చేస్తున్న సమ్మెలో భాగంగా 11వ రోజు ఎర్రటి దుస్తులతో కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆటతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు శృతిక మాట్లాడుతూ గత పది రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి గతంలో ఇచ్చిన హామీ నెరవేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తమను విద్యాశాఖలో విలీనం చేయాలన్నారు. అప్పటివరకు ఉద్యోగ బాధ్యత కల్పించి పేస్కేల్ ఇవ్వాలన్నారు. ఉద్యోగికి జీవిత బీమాతో పాటు ఆరోగ్య భీమా వర్తింపచేయాలన్నారు.

మద్దతు తెలిపిన వామపక్ష నాయకులు

సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరసన దీక్షకు వామపక్ష ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ





జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. మద్దతు తెలిపిన వారిలో నాయకులు ఆత్మకూరి చిరంజీవి, నైతం రాజు, దుర్గం దినకర్, గుడిసెల కార్తీక్, గెడం టీకానంద్, జగజంపుల తిరుపతి, కొదురుపాక మహేష్, బావునే వికాస్, వెలిశాల కష్ణమాచారిలు, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, పిఆర్టియు తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మధుకర్, జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్, నాయకులు ఇన్నారెడ్డి, టియుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సదాశివ్, సిపిఎస్ జిల్లా అధ్యక్షులు శ్రావణ్ లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీల ప్రత్యేక అధికారులు మీనా, దుర్గం సందీప్, రాజ్ కుమార్, దేవేందర్, భార్గవి, మదనశ్రీ, సత్పుత్ రావు, త్రివేణి, వినోద, సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా గౌరవ అధ్యక్షులు మోహన్, ఉపాధ్యక్షురాలు నాగసుధ, ప్రధాన కార్యదర్శి తుకారం, సంఘం జిల్లా కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్, దుర్గం సందీప్, అన్నపూర్ణ చైతన్య, ఎంఐఎస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, రాజేష్, వెంకటేష్, పీజీసిఆర్టిలు లు అన్నపూర్ణ, స్వప్న, పిటిఐ అధ్యక్షుడు సత్యనారాయణ, రమేష్, ప్రకాష్ తిరుపతి, శివరాం, ప్రసన్న, స్వప్న, విజయ బాబు, వెంకటేష్, సుభాష్, సతీష్, పవన్ పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌ల ద్వారా విద్యార్థుల ప్రతిభకు పదును

నవతెలంగాణ-కాగజ్‌నగర్

టాలెంట్ టెస్టుల నిర్వహణ ద్వారా విద్యార్థుల ప్రతిభను వెలికితీసినవారమవుతామని కాగజ్‌నగర్ మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ అన్నారు. తెలంగాణ బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం కాగజ్‌నగర్‌లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల (పెట్రోల్‌పంపు)లో జిల్లా స్థాయి టాలెంట్ టెస్టును నిర్వహించారు. దీనికి హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ ఇలాంటి టెస్టులు నిర్వహించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఈ టెస్టులు రాబోయే వార్షిక పరీక్షలలో అత్యధిక మార్కులు రావడానికి దోహదపడతాయని అన్నారు. ఆర్‌బి ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటి రవీందర్ మాట్లాడుతూ రాబోయే అన్ని రకాల పోటీ పరీక్షలకు ఈ టాలెంట్ టెస్టులు ఒక అనుభవంగా ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరాజయ్య, జిల్లా బయాలజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షులు బత్తుల శాంతికుమార్, ప్రధాన కార్యదర్శి వడ్లూరి రాజేష్, గౌరవాధ్యక్షులు జాడి కేశవ్, కోశాధికారి బడుగు శ్రీనివాస్, ఉపాధ్యాయులు సమత, సంధ్యారాణి, భారతి పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన వారు వీరే

జిల్లా స్థాయిలో శుక్రవారం నిర్వహించిన బయో సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరికి ధృవీకరణ పత్రాలతో పాటు మెమోంటోలను అందించారు. తెలుగు మీడియం విభాగంలో డి జ్ఞానేశ్వర్ (జెడ్పీఎస్ఎస్ పెంచికల్‌పేట్), యు శ్రావిష్మ (జెడ్పీఎస్ఎస్, రాస్పల్లి), ఇంగ్లీషు మీడియం విభాగంలో వై అనూష (టీజీఎస్‌డబ్ల్యుఆర్, సిర్పూరు టి), డి అభినయ్ (జెడ్పీఎస్ఎస్, పెట్రోల్‌పంపు, కాగజ్‌నగర్)లు రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 28న జరిగే రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారని తెలంగాణ బయో సైన్స్ ఫోరం అధ్యక్షులు బత్తుల శాంతికుమార్ తెలిపారు.

ముగిసిన సీఎం కప్ క్రీడా పోటీలు

- రాష్ట్ర స్థాయికి 403 మంది ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

స్థానిక గిరిజన క్రీడ పాఠశాల మైదానంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్ కప్ క్రీడా పోటీలు మూడవ రోజుతో ముగిసాయి. బాలికలకు కబడ్డీ, ఖోఖో, గోలేటిలో స్విమింగ్ బ్యాడ్మింటన్, సేపాక్ తక్రా, కాగజ్ నగర్‌లో కరాటే, కిక్ బాక్సింగ్, మొదలగు క్రీడలు నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా యువజన క్రీడల అధికారి రమాదేవి, ఏసీఎంఓ ఉద్ధవ్, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డితో కలిసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గత మూడు రోజులుగా జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ రకాల క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 403 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు ప్రశంసా పత్రాలను అందజేయడంతో పాటు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ చిరంజీవి, జీసీడీఓ శకుంతల, గిరిజన క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగు, పేట సెక్రటరీ కృష్ణమూర్తి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వెంకటేష్, కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ధర్మారావు, క్రీడా పాఠశాల శిక్షకులు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, జిల్లాలోని వ్యాయమ ఉపాధ్యాయులు సాంబశివరావు, మధుసూదన్, విద్యాసాగర్, వెంకటేష్, బిక్కు, లక్ష్మణ్, మంగవతి, జయశ్రీ, ఇందిరా, నాగరాణి, అంజలి, రాకేష్, సాయి పాల్గొన్నారు.



నిర్ణీత గడువులోగా ఇండ్ల సర్వే పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల ఇంటింట సర్వే ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని రాజంపేట గ్రామపంచాయతీలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి దరఖాస్తుదారుల వివరాలను ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో భాగంగా ప్రతి 500 ఇండ్లకు ఒక సర్వే అధికారిని నియమించడం జరిగిందని, నిర్ణీత గడువులోగా సర్వే ప్రక్రియను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సర్వే సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఆల్ రైస్ మిల్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కమిటీ సమావేశం సిర్పూర్ మండలం అయ్యప్ప స్వామి దేవాలయం ప్రక్కన ఉన్న పాత రైసెమిల్ ఎదుట హమాలీ వర్కర్ వగాడే రవి అధ్యక్షన సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా రైస్ మిల్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ రైస్ మిల్లులో పనిచేస్తున్న గుమస్తా ఆపరేటర్ హమాలీ డ్రైవర్లకు, భవన నిర్మాణ కార్మికుల వలే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్ వర్కర్లకు 50 సంవత్సరాలకే పెన్షన్ సౌకర్యం కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మొదటి దఫాలోనే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐపీఎఫ్ సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పించి ఆదుకోవాలని కోరారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నూతనంగా కుమురంభీం రైస్ మిల్ వర్కర్స్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్ పేరుతో నామకరణం చేస్తూ నూతన జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా రవి, ప్రధాన కార్యదర్శిగా, మానెపల్లి విలాస్, ఉపాధ్యక్షులుగా సద్దుల శంకర్ కోశాధికారిగా బండ మహేష్, సహాయక కార్యదర్శిగా వాగాడే రవి, ప్రచార కార్యదర్శిగా మురళీ, కార్యదర్శిగా, బండ దత్తు, జిల్లా కమిటీ సభ్యులుగా ఎనిమిది మంది మొత్తం పదిహేను మందితో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కాంట్రాక్టు ఏఎన్ఎంల సర్వీస్ రెగ్యులర్ చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వైద్య శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఏఎన్ఎంల సర్వీసును రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కృష్ణమా చారి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట చేస్తున్న 48 గంటల నిరసనలో భాగంగా రెండవ రోజు ఆయన పాల్గొని నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సేవలో ఏఎన్ఎంల పాత్ర ఎంతో గొప్పదన్నారు. వారి సేవలను గుర్తించి వెంటనే ప్రభుత్వం వారి సర్వీస్ రెగ్యులర్ చేయాలని కోరారు. మెటర్నిటి లీవ్ లు, ఇతర సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఏఎన్ఎంల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సంతోషి, కార్యదర్శి పుణ్య సిస్టర్, నాయకులు పద్మ, శోభ, పుష్ప, శైలజా, ఈశ్వరి, శ్యామలా, గీత పాల్గొన్నారు.

ఇంటింటా ఇందిరమ్మ సర్వే కొనసాగింపు



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని శాంతినగర్‌లో శుక్రవారం ఇందిరమ్మ ఇంటింటా సర్వే నిర్వహించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు బిరుదుల లాజర్, గ్రామపంచాయతీ సిబ్బంది పోడేటి రాజన్న, దాకూరి అరుణ్ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు.

వాంకిడి : మండలంలోని ఖమాన, కోమటిగూడ, కన్నర్‌గావ్ గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇంటి లబ్దిదారుల ద్వారా ఆన్‌లైన్ డాటా సేకరణ తీరును శుక్రవారం ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో అందుబాటులో ఉండేలా ముందస్తు సమాచారం ఇవ్వాలని తెలిపారు. తద్వారా సర్వే సకాలంలో పూర్తి అయ్యే అవకాశం ఉందన్నారు. సర్వేలో కచ్చితత్వాన్ని పాటించాలని, తప్పులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

జన్నారం : గ్రామాల్లో అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని ఎంపీడీవో శశికళ అన్నారు. శుక్రవారం మండలంలోని పొన్కల్ జీపీలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. సర్వే పారదర్శకంగా నిర్వహించాలని, అవకతవకలకు తావివ్వకూడదని పేర్కొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ అర్హులను ఎంపిక చేయాలని సూచించారు.

గాడ్గే బాబా మహరాజ్ ఆశయానికి కృషి చేస్తాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సంత్ శ్రీ గాడ్గే బాబా మహారాజ్ బాటలో నడుస్తూ ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని రజక సంఘం పట్టణ అధ్యక్షులు ముల్కుల్వార్ సంతోష్ తెలిపారు. గాడ్గే బాబా మహారాజ్ పుణ్యతిథిని పురస్కరించుకుని పట్టణంలోని సంఘం ఆవరణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి సమాజ హితం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ రజకుల కుల గురువైన గాడ్గే బాబా మహారాజ్ సమాజ అభ్యున్నతి కోసం విశేష కృషి చేశారన్నారు. అనేక విద్యాలయాలను స్థాపించి ప్రతి ఒక్కరికి విద్యను అందించాలన్న సంకల్పంతో ముందుకు సాగారని పేర్కొన్నారు. అటువంటి మహనీయుని ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముస్కు వినోద్, గంగాధర్, సుభాష్, కార్తీక్, విట్టల్, అశోక్, ప్రకాష్, నవీన్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయండి

నవతెలంగాణ-తాండూర్



ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలని ఎంపీఓ అనిల్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ గృహాల కేటాయింపు కోసం నిర్వహించే ఇండ్ల సర్వేను పర్యవేక్షించారు. ప్రజా పాలన దరఖాస్తుల ఆధారంగా ఇండ్ల సర్వే జరగాలని తెలిపారు. ఇంటి స్థితిగతులను తెలియజేసే విధంగా సంబంధించిన యాప్‌లో ఫోటోలను అప్లోడ్ చేయాలని సూచించారు. వ్యవసాయ పనులు జరుగుతున్న తరుణంలో యజమానులు ఇంటి వద్ద ఉన్న సమయంలో పంచాయతీ కార్యదర్శులు సర్వే పనులు నిర్వహించాలని తెలిపారు. ఆయనతో పంచాయతీ కార్యదర్శి కార్తీక్ ఉన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలను మండల ప్రత్యేక అధికారి బి సంజీవరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం గురించి పాఠశాల బాలికలను మెనూ అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి అని, పాఠశాల రికార్డ్స్ పరిశీలించారు. అనంతరం అన్నం మెత్తగా ఉండుటవలన వంట చేసే వాళ్ళతో మాట్లాడి రేపటినుండి బాగుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీఓ కె.సరోజ పాల్గొన్నారు.

బాలికలు, మహిళలను వేధిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే బాలికలు, యువతులను, మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని షీ టీమ్ సిబ్బంది హెచ్చరించారు. శుక్రవారం సాధికారక హబ్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి బాపూలే రెసిడెన్సియల్ స్కూల్ అండ్ కాలేజ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీ టీమ్ సిబ్బంది మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, ఫోక్సో చట్టాల గురించి, బాల్య వివాహాల పరిణామాల గురించి వివరించారు. మహిళలు బాలికలు విద్యార్థినిలు షీటీమ్స్ సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. ఎవరైనా వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడిన, ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100 లేదా రామగుండం షీ టీమ్ 6303923700 నెంబర్‌కు ఫిర్యాదు చేసి వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే షీ టీమ్ నెంబర్‌కు తెలపాలని, షీ టీమ్ పోలీసులు ద్వారా విద్యాసంస్థల వద్ద, రద్దీ ప్రదేశాల్లో సివిల్ డ్రస్‌లలో నిత్యం తిరుగుతూ నిఘా ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక, ఫైనాన్షియల్ లిటరసీ లిప్సిక పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ఏకరూప దుస్తులు అందజేత



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిష్టాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని ఆంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న చిన్నారులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. శుక్రవారం చిన్నారులకు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, హెచ్‌ఎం సుధాకర్ నాయక్ ఉపాధ్యాయులు రామటంకి శ్రీనివాస్ సమక్షంలో ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులకు ఏకరూప దుస్తులు ఇవ్వడం వలన చిన్నతనం నుంచే పాఠశాల వాతావరణం సంసిద్ధత సంభావన సామాజిక సమానత్వం అలవర్చుకుంటారని అన్నారు. ఏకరూప దుస్తులు ఇవ్వాలని గతంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షుడు జాడి రాజన్న, జిల్లా అధ్యక్షుడు రామ టెంకి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నోసార్లు ప్రభుత్వానికి నివేదిక అందించామన్నారు. ఉపాధ్యాయ సంఘం సూచనల మేరకు ప్రభుత్వం చిన్నారులకు దుస్తులు అందించడం ఆనందంగా ఉందన్నారు.

సింగరేణి డే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులపై ప్రతి విషయంలో చూపిస్తున్న వివక్ష, నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా 23వ తేదీన నిర్వహిస్తున్న సింగరేణి డేను కాంట్రాక్టు కార్మికులు నల్ల బ్యాడ్జీలతో, జెండాలతో చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్‌సీకేఎస్(సీఐటీయూ) శ్రీరాంపూర్ డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ కోరారు. శుక్రవారం సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఓసీపీలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ప్రతి విషయంలో కాంట్రాక్టు కార్మికులపై వివక్షను చూపుతూ, కాంట్రాక్టు కార్మికులకు చేసిన అగ్రిమెంట్ అంశాలను అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సహాయ కార్యదర్శి కాజీపేట రాజేశం, సంపత్, సమ్మన్న, ప్రభాకర్, రాకేష్, సురేష్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సీపీఐ(ఎం) మద్దతు

నవతెలంగాణ-నస్పూర్



గత 11 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేపడుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులకు శుక్రవారం సీపీఐ(ఎం) నాయకులు మద్దతు తెలిపారు. కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలకు, పోరాటానికి మద్దతు తెలపారు. అనంతరం కలెక్టర్‌లోని ఏఓ సురేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 18 ఏండ్లుగా విద్య శాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్షణ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్,కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. పని చేస్తున్న వారందర్నీ రెగ్యులరేషన్ చెయ్యాలని, బీమ సౌకర్యం, పదవి విరమణ చేసినవారి బెనిఫిట్స్ కల్పించాలని చేపట్టిన న్యాయమైన పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే ఉద్యోగ సంఘ నాయకులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని ఎడల ఉద్యోగులకు మద్దతుగా జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చెప్పడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గొమాస ప్రకాష్, దూలం శ్రీనివాస్, సామల ఉమ రాణి, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి



నవతెలంగాణ-మంచిర్యాల

రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని, బేషరతుగా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని ప్రజా సంఘాల డిమాండ్ చేశాయి. శుక్రవారం జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్లా కార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీఎస్, డీవైఎఫ్ఐ, ఐద్వా, రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ సామాజిక న్యాయం కోరుకునే వారందరికీ స్ఫూర్తి ప్రదాతైన డా బీఆర్ అంబేద్కర్‌ను అవమానించడం బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. బాధ్యతయుతమైన హోదాలో ఉన్న అమిత్ షా రాజ్యసభలో అంబేద్కర్‌ను హేళన చేసినందుకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దూర్కే మోహన్ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సంకె రవి, మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సామల ఉమారాణి, యామిని, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్



జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో ముఖ్య ప్రణాళిక అధికారి జి.సత్యంతో కలిసి పంచాయతీరాజ్, రోడ్లు-భవనాల శాఖల అధికారులతో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మురుగు కాలువలు,



అంతర్గత రహదారులు, సెప్టిక్ ట్యాంక్లు, కల్వర్టులు, ప్రహరీగోడలు, గ్రేవల్ రోడ్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా గుత్తేదారులతో సమీక్షించి ప్రతి రోజు పనుల పురోగతిని పర్యవేక్షించాలని తెలిపారు. ప్రతి రోజు పనులను పరిశీలించి నివేదిక అందించాలని, ఈ నెల 31వ తేదీలోగా యుద్ధ ప్రాతిపాదికన పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులు త్వరగా పూర్తి చేసే విధంగా సంబంధిత గుత్తేదారులకు ఆదేశాలు ఇవ్వాలని, ప్రారంభం కాని పనులను త్వరగా ప్రారంభించాలని, టెండర్ స్థాయిలో ఉన్న పనులకు త్వరగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ ఎం.స్వామిరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిగత రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

నవతెలంగాణ-నస్పూర్



ప్రతి ఒక్కరూ వ్యక్తిగత రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా ఏరియా వర్క్ షాప్‌లో వార్షిక రక్షణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని జీఎం సూర్యనారాయణ, రక్షణ వారోత్సవాల ఇన్స్‌పెక్షన్ కమిటీ కన్వీనర్, కార్పొరేట్ జనరల్ మేనేజర్ సెంట్రల్ వర్క్ షాప్స్ దామోదర్ రావు, బెల్లంపల్లి రీజియన్ జనరల్ మేనేజర్ సేఫ్టీ రఘు కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వార్షిక రక్షణ పక్షోత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని, అన్నారు. వ్యక్తిగత రక్షణతో పాటు ఇతరుల రక్షణను కూడా ఎల్లవేళలా చూస్తూ ఉండాలని, సింగరేణి సంస్థలో సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్స్‌తో ముందుకు వెళుతుంటామని, ప్రతి ఒక్క ఉద్యోగి సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్స్ తెలుసుకొని ముందుకు వెళ్లాలని సంస్థ 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి దిశగా ముందుకు వెళుతుందని, ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించే క్రమంలో రక్షణ ఎవరూ మరువకూడదని సూచించారు. ఉద్యోగులందరూ సింగరేణి వ్యాప్తంగా ప్రతిరోజు రక్షణ ప్రతిజ్ఞతో తమ విధులను ప్రారంభించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం నాయకులు ఎం కొమురయ్య, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎం ఏరియా వర్క్ షాప్ రవీందర్, ఎస్ఈ వర్క్ షాప్ రామిరెడ్డి, సభ్యులు రామ్మోహన్, నరేంద్ర కుమార్, రాజ్ కుమార్, సాయి సందీప్, కోదండ రాము, రమేష్, సదానందం పాల్గొన్నారు.



అడవుల సంరక్షణ అందరి బాధ్యత

నవతెలంగాణ-జన్నారం

అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని ఇంధన్‌పెల్లి ఎఫ్ఆర్ఓ కారం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అడవుల సంరక్షణపై అవగాహన కల్పించారు. తాము ఎక్కడ ఉన్నా ఏ ప్రదేశంలో ఉన్న అడవి బిడ్డలుగా ఉంటూ అడవులను కాపాడటమే లక్ష్యంగా పనిచేస్తామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఇంధన్‌పెల్లి అటవీ రేంజ్ పరిధిలోని గనిశెట్టి కుంట మైసమ్మ కుంటలో పర్యటించి అడవి అందాలను తిలకించారు. కార్యక్రమంలో ఎఫ్ ఎస్ఓలు రవి, హనుమంతరావు, బీట్ అధికారులు ముజీవుద్దిన్, రుబీనా, పోచయ్య పాల్గొన్నారు.

వాహనాలపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలో ఉదయం ఓ ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. వాహన దారులపైకి దూసుకెళ్లడంతో జనం భయంతో పరుగులు తీశారు. శుక్రవారం ఉదయం మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న గోదావరిఖనికి చెందిన ఆర్టీసీ బస్సు వెంకటేశ్వర టాకీస్ సమీపంలో వాహనదారులపైకి దూసుకెళ్లింది. మొదట స్కూటీ పైన ఉన్న వ్యక్తిని ఢీ కొట్టిన బస్సు రోడ్డు పక్కన పార్క్ చేసి ఉన్న వాహనాల పైకి దూసుకెళ్లడంతో పలు వాహనాలు దెబ్బతిన్నాయి. స్కూటీ పై ఉన్న వాహనదారునికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఘటనలో రెండు కార్లు, మూడు బైక్‌లు దెబ్బతిన్నాయి. బస్సు డ్రైవర్ అస్వస్థతకు గురి కావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. డ్రైవర్ ఎల్లయ్యకు ఫిట్స్ రావడంతో బస్సు అదుపు తప్పినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో ఎల్లయ్య చికిత్స పొందుతున్నాడు.

సీఎండీ స్ట్రక్చర్ సమావేశంలో సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

సీఎండీ స్ట్రక్చర్ సమావేశంలో కార్మికుల చిరకాల ఆకాంక్షలు నెరవేర్చాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఓసీ వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. ఈ నెలలో నిర్వహించే సమావేశంలో ఐటీ మాఫీ, సొంతింటి కల, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాలకు గుర్తింపు పత్రం తీసుకుంటే ఈ సమస్యలు ఇప్పటికే పరిష్కారం అయ్యేవనీ, కానీ నాలుగు సంవత్సరాల కాలపరిమితి కోసం అత్యాశపడి కార్మిక సమస్యలు పెండింగ్‌లో పెట్టారని అన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా గెలిచిన సంఘాలకు తమ వంతు బాధ్యతను ఎప్పటికప్పుడు పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సీఐటీయూ కల్పించిన అవగాహన మేరకు అన్ని కార్మిక సంఘాలు, ప్రజాప్రతినిధులు సైతం సొంత ఇంటి పథకం, అలవెన్సుపై ఐటి మాఫీ, మారుపేర్ల వంటి సమస్యలపై స్పందిస్తున్నారని కానీ పరిష్కారానికి ఏ మాత్రం ఆదేశాలు ఇచ్చేలా కృషి చేయడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు గుల్ల బాలాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళ శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులను గుర్తించండి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-తాండూర్

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపడుతూ నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలోని 16,1,4,11,14,20 వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టే ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేకు సంబంధించిన యాప్‌లో లబ్ధిదారుల ఇండ్ల చిత్రాలను అప్‌లోడ్ చేసేటప్పుడు కచ్చితత్వాన్ని పాటించాలని తెలిపారు. ఇంటి స్థితిగతులు ఇంటి స్థలం డాక్యుమెంట్లను నమోదు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. సర్వే తీరుపై వార్డ్ ఆఫీసర్లు ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలన్నారు. సొంతిల్లు లేని పేదలు, ఒంటరి స్త్రీలు, వికలాంగులు, వితంతువుల వివరాలు నమోదు చేసేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, వార్డ్ కౌన్సిల్ సభ్యులు సూరం సంగీత, షేక్ ఆస్మా యూసుఫ్, ఎలిగేటి సుజాత శ్రీనివాస్, గోశిక రమేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీఏవీ పాఠశాలలో డిటిజల్ క్లాస్ రూమ్ ప్రారంభం



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో నడుస్తున్న డీఏవీ ఓరియంట్ జ్ఞాన్ మందిర్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంలో భాగంగా సీబీఎస్ఈ అనుమతులు వచ్చాయని ఓరియంట్ యూనిట్ హెడ్ బాల గిరిధర్ పేర్కొన్నారు. డీఏవీ ఓరియంట్ జ్ఞాన్ మందిర్ పాఠశాలలో 23 తరగతి గదులలో డిజిటల్ క్లాస్ రూములుగా మార్చారు. ఈ మేరకు డిజిటల్ క్లాస్ రూములను యూనిట్ హెడ్ బాల గిరిధర్ ప్రారంభించారు. సీబీఎస్ఈ విద్యను అభ్యసించడం వల్ల పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని బాల గిరిధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓరియంట్ సీనియర్ హెచ్ఆర్ జీఎం ఆనంద్ కులకర్ణి, హెచ్ఎం కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పరారీలో ఉన్న పేకాటరాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని వరిపేట శివారులో పేకాట ఆడుతూ గురువారం ముగ్గురు అరెస్ట్ కాగా ఐదురుగు పరారీలో ఉన్నారు. శుక్రవారం పరారీలో ఉన్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. భవిష్యత్తులో మళ్లీ పేకాట ఆడకుండా పేకాటరాయుళ్లందరినీ తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్లు ఊడుస్తూ నిరసన తెలిపిన ఉద్యోగులు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని చేపట్టిన సమ్మెలో భాగంగా నిర్మల్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట రోడ్లు ఊడుస్తూ ఉద్యోగులు శుక్రవారం నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎన్నికల సమయంలో ప్రభుత్వం హామీలు ఇచ్చి ఏడాది గడుస్తున్నా పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని చాంద(టి) బైపాస్ రోడ్డు వద్ద రెండు రోజుల కింద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి సంబంధీకులు ఎవరు రాకపోవడంతో ఎస్సై ముజాహిద్ స్మైల్ సొసైటీ ప్రతినిధులకు సమాచారం అందించారు. వారు ముందుకు వచ్చి శుక్రవారం మృతదేహానికి సాంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు కేమ శ్రీకాంత్, భూరె సురేష్, మేకల రవికాంత్ యాదవ్, కిరణ్, రామకృష్ణ, సాయిగౌడ్, నజీర్ పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ- నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తును ఆరాధిస్తూ ప్రార్ధనలు, గీతాలాపనలు చేశారు. ఏసుక్రీస్తు జీవితం చరిత్రను వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రిస్మస్ ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది ప్రజలు జరుపుకునే మతపరమైన, సాంస్కృతిక పండుగ అని అన్నారు. ప్రతి ఏటా క్రిస్మస్ పండుగను క్రైస్తవులంతా వైభవంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ రోజు ఈ సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. అన్ని మతాల ప్రజలు మతసామరస్యాన్ని పాటిస్తూ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. క్రైస్తవ సోదరులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలలో అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఏఎస్పీ అవినాష్ కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, ఏఓ యూనిస్ అలీ, ఇన్‌స్పెక్టర్‌లు నవీన్ కుమార్, సైలు, సైదారావు, రామకృష్ణ , మల్లేష్, కృష్ణ, రమణరావు, ఆర్‌ఐలు రాం నిరంజన్‌రావు, రమేష్, రామకృష్ణ, ఎస్‌ఐలు ప్రదీప్, నరేష్, లింబాద్రి, సందీప్ కె, గోపి, శ్రీకాంత్, సందీప్, ఏ.సాయి కుమార్, సాయి కిరణ్, అశోక్, సాగర్, ఆర్‌ఎస్‌ఐలు వినోద్, రవి కుమార్, రాజ శేఖర్, రవి పాల్గొన్నారు.

గోలేటిలో జిల్లా స్థాయి సీఎం కప్ ఎంపిక పోటీలు



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి గ్రామంలో శుక్రవారం సీఎం కప్ ఎంపిక పోటీలు నిర్వహించారు. సెపక్ తక్రా, బాడ్మింటన్, స్విమ్మింగ్ క్రీడల్లో ఎంపిక పోటీలు జరిపారు. దీనికి జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ మీనారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులు రాణించి రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. క్రమశిక్షణతో ఉండి మంచి క్రీడా నైపుణ్యం ప్రదర్శించాలన్నారు. క్రీడల్లో రాణించి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకువాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ వెంకటేష్, సింగరేణి స్కూల్ హెడ్ మాస్టర్ ఎం.రవితేజ, సెపక్ తక్రా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ భాస్కర్, జిల్లా బాల్ బాడ్మింటన్ సెక్రటరీ ఎం. వెంకటేశ్వర్లు, సెపక్ తక్రా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబెర్ కె.మల్లేష్, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.సంపత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బి.ఉపేందర్, జిల్లా చెస్ సెక్రటరీ కల్పన, జిల్లాలోని వివిధ మండలాల ఫిజికల్ డైరెక్టర్స్ జి.లక్ష్మణ్, ఈ. సత్యానారాయణ, ఈ.అజయ్, ఠాగూర్ జితేందర్ సింగ్, అంజలి, హరీష్, ప్రభాకర్, నరేష్ పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న యువకుని కండ్లు దానం

నవతెలంగాణ-తాంసి



విద్యుత్ ఆపరేటర్‌గా పని చేస్తూ తాగుడుకు బానిసై ఆత్మహత్య చేసుకున్న మండల కేంద్రానికి చెందిన కాడిగిరి సంతోష్(30) కండ్లను ఎస్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. సంతోష్ గురువారం మధ్యాహ్నం సబ్‌స్టేషన్‌లో పురుగులమందు తాగి అపస్మారక స్థితిలో కెళ్లాడు. తోటి సిబ్బంది వెంటనే 108లో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల అనుమతితో మృతుని నేత్రాలను ఎల్‌వి ప్రసాద్ కంటి హాస్పిటల్‌కు దానం చేశారు. మృతునికి భార్య, రెండు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పురుగులమందు తాగి ఆత్మహత్య



నవతెలంగాణ-చింతలమానేపల్లి

గూడెం గ్రామానికి చెందిన చౌదరి రూపేష్(25) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ నరేష్ తెలిపాడు. జీవితంపై విరక్తి చెంది యువకుడు పురుగులమందు తాగాడు. తండ్రి చౌదరి మొండి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మంత్రిపదవి రావాలని పూజలు

నవతెలంగాణ-లింగంపేట్

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుకు మంత్రి పదవి రావాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నార గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. రామాలయం వద్దకు పెద్ద ఎత్తున మండల కాంగ్రెస్ కార్యకర్తలు ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. లింగంపేట్ రామాలయం నుండి ముత్తడి పోచమ్మ ఆలయం వరకు పాదయాత్ర చేశారు. అనంతరం ముత్తడి పోచమ్మ ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. పనిచేసే సత్తా మాట ఇచ్చి మడమ తిప్పని నాయకుడు మదన్ రావు అన్నారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రశ్నించే గొంతు మదన్మోహన్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో లింగంపేట్ మండల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎల్లమయ్య, నాగరాజు, ఏగొండ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ప్రసాద్ గౌడ్, రాజు, నగేష్, అశోక్, శ్రీనివాస్, సాయికుమార్, కిషన్, బైరయ్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల భవనాల పనులు పూర్తి చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ఏజెన్సీ ప్రాంతాల ఆశ్రమ పాఠశాలలో ఉన్న భవన మరమ్మత్తులు, రోడ్లు, వంతెన నిర్మాణాలను ఈ నెలలోపు పూర్తిచేయాలనీ ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా శుక్రవారం ఇంజనీర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న వసతి భవనాలు, అదనపు తరగతి గదులు, వంట గదులు, ప్రహరి గోడలను, మరుగుదొడ్లలని పూర్తి చేయాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, సీసీ రోడ్లు, వంతెన నిర్మాణాలను ఈ నెల వ్యవదిలో పూర్తి చేయాలని ఉమ్మడి జిల్లా ఇంజనీర్ అధికారులకు ఆదేశించారు. వర్ష కాలంలో దెబ్బతిన్న ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉన్న ప్రాంతాల రోడ్లను బ్రిడ్జిలను త్వరగా పూర్తి చేసి ప్రారంభిచాలని అన్నారు. అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ భవనాలను కూడా పూర్తి చేయాలని సూచించారు. జరుగుతున్న పనుల ఫోటోలను రోజు వర్క్ మానిటర్ సిస్టమ్‌లో పొందుపర్చాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లు త్వరగా చెల్లించే విధంగా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ నిరంజన్, డీఈలు శివప్రసాద్, డీఈ సతీష్ ఉమ్మడి జిల్లాల ఏఈలు శంకర్, ఉజ్వల్, రఘు, సుధాకర్, సాయికృష్ణ, ఇందల్, ప్రదీప్, బద్రుద్దీన్, సీనియర్ అసిస్టెంట్లు ముకుంద్, సాయి పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలలో మస్కాపూర్ విద్యార్థుల ప్రతిభ

- 12బంగారు, 3రజత పతకాలు సాధించిన విద్యార్థులు
- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని మస్కాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు 15 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 27 నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో జరుగనున్న సీఎం కప్ ఆటల పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు వెళ న్నారని, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈనెల 16 నుంచి 19 వరకు నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన సీఎం కప్ ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచి, 12 బంగారు, 3 రజత పతకాలను సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వివిధ కేటగిరిలలో వెయిట్ లిఫ్టింగ్‌లో ఎ.విష్ణు, బి.సిద్దార్థ, కె.రాహూల్, జె.రాజు, అర్కం, టి.సంహిత, బి.శ్రీనిధి, టి.నిశితవర్థిని, యోగాలో ఎ.శ్రీజ, సాయిప్రజ్ఞ, వరణ్‌లు బంగారు పతకాలు సాధించగా ఖాసిఫ్, శశికర్, గౌతంలు రజత పతకాలను సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా ఘన విజయం సాధించాలని పాఠశాల ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్‌రావు, పీడీ షేక్ ఇమ్రాన్, ఉపాధ్యాయులు తొంటి శంకర్, కుర్ర శేఖర్, జాడి శ్రీనివాస్, వెన్నం అంజయ్య, లక్ష్మణ్‌రావు, సయ్యద్ ఫరాజ్, కిషన్, ప్రసాద్, విజయ్ కుమార్, మహ్మద్ షఫీ, రవి, చందన, స్వప్న, గంగాధర్, రమేష్, సృజన, సాయికిరణ్, యూనీస్ పాల్గొన్నారు.

ఉద్యాన కోర్సులు చదివి పారిశ్రామికవేత్తలుగా ఎదగొచ్చు

- ఉద్యాన కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉద్యాన కోర్సులు చదివి శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించుకున్నట్లయితే భవిష్యత్తులో పారిశ్రామికవేత్తలుగా ఎదగటానికి అవకాశం ఉంటుందని రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి, ఐటీడీఏ, ఉట్నూర్ ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ పార్టీలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వివిధ రంగాలలో ఉద్యాన కోర్సులకు ఉన్న డిమాండ్ గురించి వివరించారు. కోర్సులు పట్టుదలతో చదవటంతో పాటు కావాల్సిన నైపుణ్య, శిక్షణ అలవర్చుకోవాలని అన్నారు. క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కొరకు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని అన్నారు. పూర్తిస్థాయిలో సబ్జెక్టుపై పట్టు ఉంటే, రైతులకు సలహాలు ఇవ్వడంతో పాటు సొంతంగా ఉపాధి కేంద్రాలు నెలకొల్పొచ్చని, నర్సరీలు, ల్యాండ్ స్కేపింగ్ వంటి రంగాలలో ఉద్యాన కోర్సులు చదివిన వారికి మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. రెండు సంవత్సరాలు పాటు క్రమశిక్షణతో మెలిగి, చక్కగా కళాశాలకు వచ్చి వృత్తిపరమైన, సాంకేతిక పరమైన అనుభవాలను, నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు ఉద్యాన పంటలలో వాతావరణ మార్పుల దృష్ట్యా, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సంబంధిత ఉద్యాన శాస్త్రవేత్తలు అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో మొదటి రెండో సంవత్సరం పాలిటెక్నిక్ ఉద్యాన కోర్సులు చదువుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థులు తమ అనుభవాలను, అభిరుచులను వక్తలతో పంచుకున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులను సాదరంగా కళాశాలలోకి ఆహ్వానించారు. వారికి కావాల్సినటువంటి సలహాలు సూచనలు ఇవ్వటానికి జీవితంలో ఎప్పుడైనా తమను సంప్రదించవచ్చని విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. అనంతరం ఉద్యాన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళి, ప్రీ యూనిక్ ఆయిల్ పామ్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ మల్లేశ్వరరావు, కళాశాల సిబ్బంది గజానంద్, ప్రసన్న, అశ్విని, ఇర్ఫాన్, చాణక్య పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- బస్టాండ్‌లో మర్యాద దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయాణికులకు ఆర్టీసీ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుంటూ సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్‌ఎం సోలోమాన్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో మర్యాద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులకు శాలువాలతో సత్కరించిన అనంతరం పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు అందిస్తున్న సేవల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం సోలోమాన్ మాట్లాడుతూ మర్యాద అనేది మనిషికి ఉన్న అన్ని సద్గుణాల్లో గొప్ప గుణమని, మనుషుల మధ్య సంబంధాలు పెరిగేందుకు దోహదం చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ కూడా సాటి మనుషుల పట్ల మర్యాదగా ఉండటం నేర్చుకోవాలని సూచించారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారికి ప్రయాణ సమయంలో ఇబ్బంది కలగకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రణీత్, డీఎం కల్పన, అకౌంట్స్ ఆఫీసర్ శంకరయ్య పాల్గొన్నారు.

శాసన సభాపతిని అవమానించిన ఎమ్మెల్యేను సస్పెండ్ చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శాసన సభపతిగా ఉన్న దళిత జాతి బిడ్డను అసెంబ్లీ వేదికగా అవమానించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తరుణంలో గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి ద్వారా జరిగిన భూఅక్రమాలను అసెంబ్లీ వేదికన రాష్ట్ర ప్రజలకు వివరించి, తప్పుల తడకగా ఉన్న ధరణినికి బదులుగా భూభారతి అనే కొత్త వెబ్‌సైట్‌ను రైతుల కోసం తీసుకురావడానికి అసెంబ్లీలో చర్చ జరిగిందని పేర్కొన్నారు. ఈ తరుణంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కసారిగా శాసన సభలోకి వచ్చి శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై కాగితలు, చిత్తు పేపర్లు పైకి వేస్తూ వికృత చేష్టలకు పాల్పడ్డారన్నారు. అలా ఒక శాసన సభాపతి అనే గౌరవం లేకుండా, ఒక మంత్రి అనే గౌరవం లేకుండా ఇష్టరీతిన వ్యవహరించిన బీఆర్‌ఎస్ శాసన సభ్యులు సభాపతికి క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు.

సభ్యత్వ నమోదులో వేగం పెంచాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా చేపట్టి కార్యకర్తలు అందరిని కూడా సభ్యులుగా చేర్పించాలని పార్టీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సిములు అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్ పార్లమెంట్ కమిటీ, తెలుగు యువత కమిటి సమావేశాన్ని పార్లమెంటు కన్వీనర్ గుళ్లపల్లి ఆనంద్ అధ్యక్షతన నిర్వహించారు. దీనికి నర్సిములుతో పాటు రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు డాక్టర్ జయరాం చందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్ చందర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బడుగు బలహీనవర్గాల పార్టీ యువతకు ప్రోత్సహిస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. గుల్లపెల్లి ఆనంద్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం అందరు కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య సెల్ దుర్గారావు, ఆదిలాబాద్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ అల్లూరి రాజారెడ్డి, మాజీ తెలుగు యువత అధ్యక్షులు గాలిపెల్లి నాగన్న, పార్లమెంట్ మాజీ ప్రధాన కార్యదర్శి పెరుగు ఆత్మారామ్, గంగారెడ్డి, సుభాష్, గంగమ్మ, కదరపు దేవిదాస్, రూపమ్మ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు టోల్‌ఫ్రీ ఏర్పాటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు సంబంధించిన ఫిర్యాదులు, ఏమైనా అభ్యంతరాలు ఉంటే లబ్ధిదారులు తెలుపవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి 18004251939 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదులు, అభ్యంతరాలు తెలుపవచ్చని సూచించారు.. ఫిర్యాదుల విభాగం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రజలు దీనిని ఉపయోగించుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ మండలంలోని ఖానాపూర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ సదానందం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనివల్ల పట్టణంలోని ఖానాపూర్, సోనార్ గల్లీ, బొక్కలగూడ, కొలిపురా, మసూద్‌చౌక్, ధన్‌గర్ గల్లీ, శాంతినగర్ ఏరియాలలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

శ్రీమద్భాగవత సప్తాహ కార్యక్రమం ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని మార్వాడి ధర్మశాలలో తొమ్మిది రోజుల పాటు సాగే శ్రీమద్భాగవత సప్తాహ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ముందుగా స్థానిక శ్రీరాణిసతీజి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం శోభాయాత్ర చేపట్టారు. అయోధ్య నుంచి వచ్చిన అంకిత్ నంద మహారాజ్ ప్రవచనంలో పాల్గొని భక్తులకు శ్రీమద్భాగవతం ప్రాశస్త్యాన్ని వివరించనున్నారు. ఆయనతో పాటు మఠాధిపతి శ్రీయోగానంద సరస్వతి, భక్తులు శోభయత్రలో పాల్గొనగా, ప్రధాన వీధుల గుండా యాత్ర సాగింది. మహిళలు కలశాలను తలపై పెట్టుకుని యాత్రలో పాలు పంచుకున్నారు. ధర్మశాల వరకు శోభాయాత్ర కొనసాగింది. ఈనెల 29వ తేదీ వరకు ప్రతి రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ప్రవచనం ఉంటుందని భక్త మండలి సభ్యులు తెలిపారు. ఈ బృహత్ కార్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

హాస్టళ్లను సందర్శించిన జడ్పీ సీఈఓ

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండల కేంద్రంలోని పలు హాస్టల్లో శుక్రవారం జడ్పీ సీఈవో చంద్ర నాయక్ సందర్శించారు. హాస్టల్ పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. హాస్టల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని హాస్టల్ నిర్వాహకులను సూచించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అన్నారు. పారిశుద్ధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో నరేష్, ఎంపీవో బళ్లారి హాస్టల్ వార్డెన్ ఉన్నారు.

దరఖాస్తుదారులన్నింటినీ ఆన్‌లైన్లో నమోదు చేయాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో దరఖాస్తు చేసుకున్న వారి అందరి వివరాలు ఆన్‌లైన్‌లో పగడ్బందీగా నమోదు చేయాలని ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని సిద్ధ రామేశ్వర నగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో భాగంగా ఆన్లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. దరఖాసుదారుల ప్రతి వివరాలు తప్పులు లేకుండా యాప్ లో నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శి అఖిలకు సూచించారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ

నవతెలంగాణ-కామారెడ్డి

హెల్మెట్ దారణ.. ప్రాణానికి రక్షణ అని, ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని విద్యార్థులు, పోలీసులు సూచించారు. కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో, నిజాంసాగర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ ఎస్‌ఐ మహేష్, సిబ్బందితో కలిసి, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సహకారంతో హెల్మెట్ వాడకంపై వాహనదారులకు పలు సూచనలు చేశారు. చిన్నపిల్లలతో హెల్మెట్ పెట్టుకోవాలని సూచించే విధంగా గులాబీ పువ్వులను ఇస్తూ, హెల్మెట్ పెట్టుకోవాలని, ప్రాణాలను కాపాడుకోవాలని వాహనదారులకు సూచించారు. హెల్మెట్ ధరించి తమ భవిష్యత్తును కాపాడాలంటు వారి తల్లిదండ్రులకు సూచించే విధంగా పిల్లలచేత ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.